క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

స్పందనకు తొమ్మిది వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం తొమ్మిది వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. జోన్–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో శ్రీకాకుళంలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భాగస్వామ్య గ్రామీణ అంచనా(పీఆర్ఏ) పద్ధతిలో గ్రామ పటం వేసి పంటల పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు, వీఏఏ హేమలత, విద్యార్థులు బి. భారతి,టి స్నేహ. శ్రావణి,ఎస్ సుప్రియ,కె. పుష్పాంజలి,సీహెచ్ మాధురి పాల్గొన్నారు.

10న పంచారామాల యాత్రకు ప్రత్యేక బస్సు

గోపాలపట్నం: ఈ నెల 10న సింహాచలం బస్ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సు నడపనున్నట్టు సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ద్వారా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్ల కోటలో ఉన్న పలు ఆలయాలను దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుందన్నారు. టికెట్ ఒక వ్యక్తికి రూ.1600గా నిర్ణయించామని తెలిపారు. పూర్తి వివరాలకు 9493226922, 7382917295 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజరాజేశ్వరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆనందభైరవుడిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షవాటిలోని ఆనందభైరవునికి మహామృత్యుంజయ సహిత రుద్రహోమం జరిగింది. అమృతబిందు సెంటర్ సభ్యులు జి. జానకిరత్నం,ఉమాదేవి,విజయలక్ష్మి తదితరులు హోమాల్లో పాల్గొన్నారు.

నాడు శిథిల నేడు రాచ బాట



పెందుర్తి: పినగాడి–కోట్నీవానిపాలెం–గొరపల్లి–గొల్లలపాలెం రహదారి టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. 2017లో ఈ రహదారికి టీడీపీ ప్రభుత్వం అరకొర నిధులు సమకూర్చి పనులు చేపట్టింది. కానీ ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా నిర్మించిన మూడు నెలలకే పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అడుగడుగునా పూర్తిగా గోతులమయం అయింది. కనీసం ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అనేక సార్లు అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అదే సమయంలో టీడీపీ నాయకులకు కాసులు కురిపించిన నీరు–చెట్టు పథకంలో చెరువు పనుల ద్వారా తీసిన మట్టిని అక్రమంగా తరలించేందుకు ఈ మార్గాన్నే టీడీపీ నాయకులు ఎంచుకోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కనీసం రోడ్డుపై రాకపోకలకు సైతం పనికిరాకుండాపోయింది. తరచూ ప్రమాదాలు కూడా సంభవించేవి. వాహనాలు మరమ్మతులకు గురయ్యేవి.

నాడు: పది గ్రామాలను అనుసంధానం చేసే పినగాడి-గొల్లలపాలెం రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోతులతో ప్రయాణికులకు నరకం కనిపించేది. ఇక వర్షాకాలం అయితే చెరువును తలపించే ఈ రోడ్డుతో వాహనదారులు అవస్థలు వర్ణనాతీతం. కానీ నాటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఒకసారి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి వదిలేసింది. కొద్ది నెలలకే యధాతథస్థితికి చేరింది. రహదారి పూర్తిగా కోతకు గురైంది. ఆ మార్గంలోనే రాకపోకలు సాగించేవారు.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాలేదు. అదే సమయంలో కరోనా విజృంభిస్తున్న సమయం. అయినా అధ్వానంగా మారిన పినగాడి-గొల్లలపాలెం రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారు పెద్దపీట వేసింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రతిపాదనతో రూ.2.05 కోట్లు విడుదల చేసి వెనువెంటనే పనులు ప్రారంభించింది. దాదాపు 5 కిలో మీటర్ల మేర రాచమార్గం నిర్మించింది.దీంతో వాహన దారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



నేడు: పినగాడిలో వేసిన రహదారి



నాడు: పినగాడి సమీపంలో రోడ్డు దుస్థితి



వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు

పది గ్రామాల ప్రజలకు మేలు

పినగాడి- కోట్నీవానిపాలెం రహదారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. టీడీపీ ప్రభుత్వం ఈ రహదారిని గాలికి వదిలేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాది లోపే రూ.2.05 కోట్లతో నిర్మాణం చేసింది. దీంతో విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని నాలుగైదు గ్రామాలతో పాటు గులివిందాడ, దెందేరు, సంతపాలెం, విశాఖ జిల్లా పెందుర్తి మండలం గవరపాలెం, గొరపల్లి, గొల్లలపాలెం, కరకవానిపాలెం, కోట్నీవానిపాలెం వాసులు ఈ రోడ్డును సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ రహదారిలో వేలాది మంది ప్రజలు ఎలాంటి అసౌకర్యం లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు.



నాడు: శిథిలమైన పినగాడి-గొరపల్లి రహదారి



నేడు: సుందరంగా నిర్మించిన పినగాడి-గొరపల్లి రహదారి

ఇబ్బందులు పడేవాళ్లం



పినగాడి–గొరపల్లి రోడ్డుపై ప్రయాణం చేస్తే మాకు సమయంతో పాటు వ్యయం కూడా తగ్గుతుంది. చిన్ననాటి నుంచి ఇదే మార్గంలో ప్రయాణం చేసేవాళ్లం. గతంలో ఈ రోడ్డు పూర్తిగా గోతులతో ఉండడం వల్ల చాలా అవస్థలు పడేవాళ్లం. వాహనం అదుపు తప్పి పలు మార్లు గోతుల్లో పడిన ఘటనలు కూడా ఉన్నాయి. 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మించడంతో మా ఇబ్బందులన్నీ పోయాయి. రోడ్డు బాగుండడం వల్ల నిమిషాల్లో మెయిన్‌రోడ్డుకు చేరుకుంటున్నాం.

– కె.శ్రీనివాసరావు, కోట్నీవానిపాలెం

ప్రభుత్వానికి ధన్యవాదాలు



గతంలో ఈ రోడ్డులో ప్రయాణం చేస్తే గోతుల కారణంగా వాహనాలు పాడైపోయేవి. మాకు కూడా అనారోగ్య సమస్యలు తలెత్తేవి. కానీ సీఎం వైఎస్ జగన్ వచ్చాక ఈ రోడ్డు బాగుపడింది. ఇప్పుడు మా వాహనాలు, మా ఆరోగ్యానికి ఇబ్బందులు లేవు. రోడ్డు నిర్మించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– జి.చైతన్య, గొరపల్లి

అన్నదాతల్లో ఆందోళన

- అప్రమత్తమైన యంత్రాంగం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- మిచాంగ్ తుపాను అలజడి



ఎక్కడికక్కడే పంట పొలాల్లో కుప్పలు వేసుకుంటున్న రైతులు



సురక్షిత ప్రదేశానికి చేర్చిన తెప్పలు

పెందుర్తి: మిచాంగ్ తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. వరి కోతలు వాయిదా వేసుకోవాలని.. కోసిన పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వేటకు వెళ్ల కుండా చర్యలు తీసుకున్నారు. దీంతో మత్స్యకారులు తీరంలో వలలు, బోట్లు భద్రపర్చుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు, కొండవాలు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–8 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. రానున్న రెండు మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజల కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని.. అత్యవసర సమయంలో 0891–2735353 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఎగసి పడుతున్న కెరటాలు

పరవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. కెరటాలు మూడు మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి చలి గాలులు బలంగా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేట మానుకున్నారు.



ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

తెప్పలను సురక్షి ప్రదేశాలకు తరలించారు. వలలు, ఇంజిన్లను సామాజిక భవనంలో భద్రపర్చుకున్నారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవడంతో బస్సులు ఖాళీగా రాకపోకలు సాగించాయి.

తీర ప్రాంతంలో అధికారుల పర్యటన

తుపాను పరిస్థితులను తెలుసుకోవడానికి తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలను సోమవారం సాయంత్రం సందర్శించారు. తుపాను సమయంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయడానికి వీఆర్వో, వీఆర్ఏలను అప్రమత్తం చేశామని చెప్పారు. అత్యవసర సమయంలో తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలన్నారు.

అన్నదాతల హైరానా

సబ్బవరం: పండిన పంట చేతికి వస్తుందనుకున్న దశలో మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో 20.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలంలో మరో 220 ఎకరాల్లో పండిన పంటలను కోతలు కోసి పంట పొలాల్లో కుప్పలు వేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. రైతులు ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండి అధిక వర్ష కురిస్తే పొలంలో పాయలు తీసుకుని జాగ్రత్త వహించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



పెదనాయుడుపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో పోతల సత్యనారాయణ



సామాజిక భవనంలో భద్రపర్చిన వలలు

హర హర మహాదేవ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన హరనామస్మరణ
- భక్తిశ్రద్ధలతో పూజలు



సరిపల్లి శివాలయంలో శివునికి పూజలు చేస్తున్న భక్తులు



సుజాతనగర్‌లో పూజలందుకున్న మహాశివుడు



శివుడికి క్షీరాభిషేకం చేస్తున్న పురోహితులు

పెందుర్తి: కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే క్యూ లైన్లలో బారులు తీరారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున అభిషేకాలు, అర్చనలు జరిపారు.

- సరిపల్లి శివాలయానికి ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శివుడికి స్వహస్తాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో వందలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.
- సుజాతనగర్ హరిహరక్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు.
- చింతలగ్రహారం గవరపాలెంలో మహాశివునికి పూజలు జరిపారు. ముందుగా అభిషేకాలు చేశారు.
- పినగాడి, చినముషిడివాడ, కృష్ణరాయపురం, సాధూమఠం ప్రాంతాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింహాచలం: కార్తీక సోమవారం పురస్కరించుకుని పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు,పూజలు నిర్వహించారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి అర్చకులు విశేషంగా అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆకాశ దీప మహోత్సవం నిర్వహించారు. అలాగే 93వవార్డు ప్రహ్లాదపురం శివాలయం, 98వవార్డు పాత అడవివరం, విజినిగిరిపాలెం, కాపు దిబ్బ, ప్రియాగార్డెన్స్, సింహపురికాలనీలోని శివాలయాల్లో పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. తులసి కోటలు, రావిచెట్టులు, మర్రిచెట్లు, ధ్వజస్తంభాల వద్ద పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. దేవస్థానానికి చెందిన పూలతోటలో ఉన్న శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.



విశేష అలంకరణలో ఉమాచంద్రమౌళేశ్వరస్వామి



అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

శివాలయాలు కిటకిట

పరవాడ: పరవాడలోని మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి మండల నలుమూలల నుంచి భక్తులు సోమవారం వేకువ జాము నుంచి ఆలయానికి తరలి వచ్చారు. శివలింగాలకు విశేష అభిషేకాలు చేశారు. తాడి శ్రీ ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో తాడి, లంకెలపాలెం, పెదముషిడివాడ, ఈ, మర్రిపాలెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీపాంజలినగర్, నాయుడుపాలెం, భర్నికం, లేమర్తి శివాలయాలు భక్తులతో రద్దీగా

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన దీక్ష

సీతమ్మధార : జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లో 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవేదన దీక్ష చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు వి.పుండరీకాక్ష మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల గడుస్తున్నా ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికి అమలు చేయలేదన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నుంచి సమ్మె బాట పట్టాలని ప్రభుత్వానికి నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పి.గణపతిరావు, ఎల్.చైతన్య, టి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం నేతృత్వంలో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి మాట్లాడుతూ మార్గశిర మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, మారుతీప్రసాద్, సురేష్, ప్రకాష్, సహాయ ఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ



దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1026వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్విరామ పోరు కొనసాగిస్తామన్నారు.